ప్రజాశక్తి
శుక్రవారం 14 జూలై 2023
5
శ్రీ సత్యసాయి





బహిరంగ సభ ర్యాలీ సందర్భంగా ఉరుములతో స్వాగతం...




రాష్ట్రానికి బిజెపి ద్రోహం



బివి.రాఘవులు



ఎం.ఎ.బేబి



ఎం.ఎ.గఫూర్



వి.రాంభూపాల్

- అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం ఆ పార్టీలకు లేదు
- విభజన హామీల అమలు ఒక్కటీ జరగలేదు
- బిజెపిని గద్దె దింపితేనే ప్రజలకు మేలు
- 'అనంత' బహిరంగ సభలో సిపిఎం నేతలు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు, గఫూర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు విమర్శించారు. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపిని ప్రశ్నించే ధైర్యం వైసిపి, టిడిపి, జనసేనలకు లేదని ఎద్దేవా చేశారు. అనంతపురం నగరంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బహిరంగ సభ జరిగింది. గత రెండు రోజులుగా అనంతపురంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఆ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ముందుగా టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరిగింది. వందలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధి, విశాఖ రైల్వే జోన్, పోలవరం నిర్మాణం ఇలా అనేక హామీలను కేంద్రం అటకెక్కించిందని విమర్శించారు. వీటిని అమలు చేయమని ప్రశ్నించలేని పరిస్థితిల్లో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలు ఉన్నాయని చెప్పారు. పైగా కేంద్రం ప్రజలపై భారాలు మోపే చర్యలన్నింటినీ వేగవంతంగా అమలు చేసేందుకు వైసిపి ప్రభుత్వం ఉత్సహం చూపుతోందన్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని కేంద్రం సూచనలకు అనుగుణంగా పెంచిందన్నారు. స్మార్టుమీటర్ల ఏర్పాటు చేస్తోందన్నారు. ఆస్తి, చెత్తపన్నుల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ఓటమే లక్ష్యంగా వామపక్షాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఆ పార్టీతో కలిసి పనిచేసే ఇతర రాజకీయ పక్షాల ఓటమికీ కూడా పనిచేస్తామని తెలిపారు. ఎం.ఎ.బేబి మాట్లాడుతూ కేంద్రంలోనున్న బిజెపి మతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య వైషమ్యాలు పెంచి ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిజెపి వ్యతిరేకత దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా విపక్షాలు కలిసొస్తన్నాయని పేర్కొన్నారు. కలిసొచ్చే పార్టీలతో రాబోయే ఎన్నికల్లో పనిచేయడం జరుగుతుందని చెప్పారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే బిజెపిని ఇంటికి పంపాల్సిందేనని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని వైసిపి ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తెలిపారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనమిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అక్కడ రూ.13500 అవుతే ఇక్కడ ఇస్తున్నది రూ.10 వేల లోపేనని చెప్పారు. దీన్ని పెంచాలని కోరితే పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసంఘటిత రంగంలో కార్మికులకు వేతనాలు సవరించాలని అధికారంలోకి వచ్చిన కొత్తలో వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. 40 రోజుల్లోపు కమిటీ వేసి వేతనాలు సవరిస్తామని ముఖ్యమంత్రి వైఎస. జగన్మోహనఁరెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. కాని నాలుగున్నరేళ్ల అయినా ఇప్పటికీ పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. మాట తప్పను మడమ తిప్పనంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన సిపిఎం శ్రేణులు, అభిమానులు, ప్రజలు

నాసిన్ పనులను వేగవంతం చేయండి

◆ఆగస్టు నాటికి భవన నిర్మాణం పనులు పూర్తి చేయాలి ◆రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



నాసిన్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నాసిన్ కంపెనీ శ్రీ సత్యసాయి జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని రాష్ట్రఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం నాడు ఆయన నాసిన్ అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం విచ్చేశారు. పరిశీలన అనంతరం నాసిన్ భవన సమావేశ మందిరంలో పలు అంశాలపై కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాసిన్ ప్రతినిధి నారాయణస్వామి, అనుపమ పట్నాకర్, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు 500 ఎకరాలు విస్తీర్ణంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాసిన్ భవన నిర్మాణం పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు. ఆగస్టు నెలలోపు భవన నిర్మాణం పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేయాలని తెలిపారు. అందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి భవన నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనపైనా దృష్టి సారించాలన్నారు. తాగునీటి పైపులు నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. పది ఎకరాల్లో కేంద్ర విద్యాలయం భవన నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మలగూరు పాలసముద్రం మధ్య రైల్వే లైన్ 17.50 కిలోమీటర్ల ఉన్న పనులను చురుగ్గా చేపట్టాలన్నారు. నాసిన్ క్యాంపస్ అంతా నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పాలసముద్రం చెరువుకు నిరంతరం నీరు ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రిసెప్షన్ బ్లాక్, ఎఫ్ఎసి, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఆఫీసర్స్ కాలనీ, హాస్టల్ బ్లాకు, రోడ్లు పనితీరు గురించి సమావేశంలో చర్చించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాసిన్ అధికారులు క్రాంతి కుమార్ రెడ్డి, రవీంద్ర గుప్తా, ఆర్డీవో భాగ్యరేఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి : కలెక్టర్



మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన వంటలు నాణ్యత ప్రమాణాలు లోపించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతను మెరుగుపరిచి విద్యార్థులకు అనువుగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. పలు విషయాలను నిర్వాహకులకు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బందితో పాటు పెడపల్లి ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేతనైతే అనుబంధ పరిశ్రమలను తీసుకురండి

పెనుకొండ: వైసిపి నాయకులకు చేతనైతే వెనక్కి వెళ్లిన కియా కంపెనీకి చెందిన 14 అనుబంధ సంస్థలను తీసుకురావాలని అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి కియా పరిశ్రమ తెచ్చారని వైసీపీ మంత్రులు ఎంపీ ప్రగల్భాలు పలకడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వైసిపి నాయకులకు చేతనైతే కియా కంపెనీకి వచ్చి వెనక్కి వెళ్లిన 14 అనుబంధ సంస్థలను తీసుకురావాలన్నారు. లేపాక్షి నాలెడ్జ్ భూముల్లోకి పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలన్నారు. ఎవరో చేసిన అభివృద్ధిని తాము చేశామని గొప్పలు చెప్పుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు సోము, ప్రసాద్, మారుతి, వాసుదేవరెడ్డి, బాలాజీ నాయక్, ఓబులేష్, రాజేష్ ,అంజి,నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ


శానిటరీ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులను వేధిస్తున్న శానిటరి ఇన్స్‌పెక్టర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. శానిటరి ఇన్స్‌పెక్టర్ తీరును నిరసిస్తు గురువారం ఉదయం పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అందరు కలిసి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డిలకు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ఎపి మున్సిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై విక్షణ రహితంగా వ్యవహరిస్తు, దుర్భాషాలడుతున్నారన్నారు. ఆయనను ప్రశ్నించిన వారిపై పని ఒత్తిడి పెంచడం, పని ముట్లు ఇవ్వకపోవటం లాంటి వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. వెంటనే ఇతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లికార్జున, ఆనంద్, మంజునాథ్, నారాయణ, చంద్ర, నాగేంద్ర, రామంజి, శివకుమార్, గురునాథ్, రామచంద్ర, కృష్ణమూర్తి, ఓబులమ్మ, శోభమ్మ, సుబ్బలమ్మ, లక్ష్మమ్మ, కవితమ్మ, క్లాప్ ఆటో డ్రైవర్లు అనిల్, కిషోర్, ప్రభాకర్‌తో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు, నాయకులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

డీ-ఫార్మసీలో 'పురం' విద్యార్థికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఎస్ ఫాతిముజ్ జోహ్రా డీ-ఫార్మసీ రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు పేర్కొన్నారు. గత ఐదు రోజుల క్రితం డీ-ఫార్మసీ ఫలితాలు విడుదల అయ్యాయి. ఇందులో కొంత మంది విద్యార్థులకు తక్కువ మార్కులు రావడంతో రీవెరిఫికేషన్‌కు ధరఖాస్తు చేసుకున్నారు. దీంతో అదనంగా 25 మార్కులు ఎస్ ఫాతిముజ్ జోహ్రా రావాడంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చింది. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినిని కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హరీష్ బాబు మాట్లాడుతు గత సంవత్సరం ఇదే కళాశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం రావడంతో పాటు జాతీయ స్థాయిలో సైతం ప్రథమ స్థానంలో నిలచి కేంద్ర మంత్రి చేత ప్రశంసలు అందుకుందన్నారు. ఈ ఏడాది సైతం తమ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్ ఫాతిముజ్ జోహ్రా 1100 మార్కులకు 1066 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుమతి, ఆదిశేఖర్, ఫరూఖ్, సత్యకీర్తి, పాణి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం


ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పుట్టపర్తికి రానున్నారు. మంత్రి రోడ్డు మార్గాన కారులో గురువారం రాత్రి 8:30 గంటలకు చేరుకుంటారు. ఈ మేరకు వెలగపూడి నుంచి ప్రత్యేక అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు నుంచి పుట్టపర్తికి చేరుకొని రాత్రికి ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్ లో బస చేస్తారు. సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు మంత్రి అనంతపురం జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్తారు.

రక్తదాతలను ప్రభుత్వం గుర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆపద సమయంలో తామున్నామంటూ రోగులకు ధైర్యం చెప్పడంతో పాటు నిస్వార్థ రక్తదానం చేస్తున్న వారికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలి రక్తదాతల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రక్తదాతల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో జెఎసి నాయకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ మాట్లాడారు. దేశంలో రక్తం కొరత లేకుండా చూస్తూ సకాలంలో రక్తదానం చేసి ప్రాణం పోసే రక్తదాతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ప్రతి రక్తదాతకు రూ.10 లక్షల ఉచితబీమా ప్రకటించాలని వీరందరికి బస్సులు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా రక్తదాతలకు సైతం గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవం రోజున సేవా పథకాలను అందించి గౌరవించాలన్నారు. ఈ సమస్యలపై త్వరలో రాష్ట్రపతిని కలిసి ఈ విషయాలను వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు హనుమంతు, హాజి నాసీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రక్తదాతల జెఎసి నాయకులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మడకశిర : మండల పరిధిలోని బేగార్లపల్లి పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, రాగమయి, ఉమామహేశ్వరి, గీతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు చైర్మన్ రామాంజనేయులు, వైస్ చైర్మన్ అశ్విని, మాజీ చైర్మన్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు ఎన్‌సి వెంకటరాముడు, ఉపాధ్యాయులు సుజాత, భారతి, పణిరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

గోరంట్ల: పట్టణంలో ఎస్వీవీఎం డిగ్రీ కళాశాలలో మొదటిసంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల డైరెక్టర్ మనోజ్, ప్రిన్సిపాల్ భక్తివత్సలం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్వీవిఎం డిగ్రీ కళాశాలలో బికాం కంప్యూటర్స్, బిబిఎ, బిసిఎ, డీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బిఎ, బీకాం ఎకనామిక్స్, బిఎస్సి బాటనీ తదితర కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

ఆక్రమణలు తొలగించండి

పరిగి : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు కొంతమంది ఆక్రమణదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దీనిపై పంచాయతీ అధికారుల స్పందించాలని జనసేన జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సబ్ స్టేషన్ ముందు మడకశిర రహదారిలో బైఠాయించి ఆందోళన చేశారు.స్థానిక సర్పంచి స్పందంచి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇదేవిధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించారని గుర్తు చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పంచాయతీ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లే పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ సురేష్, శివశంకర్, రామాంజి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పూజాసామగ్రి విక్రయానికి వేలంపాట

నల్లచెరువు : మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణమాసంలో పూజాసామగ్రి విక్రయాన్ని దక్కించుకోవటానికి గురువారం వేలంపాటను నిర్వహించారు, టెంకాయలు పూజాసామాగ్రి విక్రయించుకునేందుకు రాములయ్య, పాలహారాలు, విడిపూలు విక్రయించుకునేందుకు రమణ నాయక్, పార్కింగ్ రుసుము వసూలు చేసుకునేందుకు ఎస్, గోవిందు హక్కులను పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సి.రామాంజనేయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఆలయ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి, ఎంపిపి రమణారెడ్డి, పాలకమండలిసభ్యులు సూర్యనారయణ, గోవింద్ రెడ్డి, రామచంద్ర, ఆలయ అర్చకులు ఆంజనేయ దాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవంపై అవగాహన

ముదిగుబ్బ : డెంగీ మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో గురువారం అవగావహన సందస్సును నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సరస్వతమ్మ, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సిహెచ్ఒ స్వర్ణలత, సచివాలయం హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

పరిగి : మండలంలోని గణపతి పల్లిలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ, అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహాశక్తి సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ రామాంజనమ్మ మహాశక్తి గురించి మహిళలకు వివరించి తెలిపారు. అలాగే అనంత శక్తి పాలకవర్గం సభ్యులు సిబ్బంది కలిసి బాల్యవివాహాలు, గృహహింస, మూఢనమ్మకాల గురించి ఒక నాటికి రూపంలో అవగాహన కల్పించారు. మహాశక్తి సీఈవో రమీజా తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సోమందేపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు, దిష్టిబొమ్మ దహనాలు సరికాదని జనసేన మండల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. అనంతరం వారు మాట్లాడుతు వాలంటరీ వ్యవస్థలో కొందరు తప్పు చేసి అందరికీ చెడ్డపేరు తెస్తున్నారని తమ నాయకులు మాట్లాడితే దానిని వైసిపి నాయకులు వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ జబీవుల్లా, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, కొల్లప్ప, ప్రధాన కార్యదర్శులు మూర్తి, శ్రీనివాసరెడ్డి, శిరీషా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

16న ఉచిత వైద్యశిబిరం

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని గౌనిపల్లి జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్‌లో ఈనెల 16న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపి ఎన్. కృష్ణమూర్తి, సామాజిక కార్యకర్త మల్లెల రమేష్ పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

కదిరి టౌన్ : నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో యువగళం యాత్రకు సంఘీభావంగా టిడిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ నారా లోకేష్ యాత్ర చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

చిలమత్తూరు : చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈ నెల 15న వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. 12 ద్విచక్రవాహనాలను వేస్తున్నామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు.

'ఆసరా' నిధుల విడుదలలో జాప్యంపై మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి రొద్దం

వైఎస్ఆర్ ఆసరా పథకం కింద తమకు విడుదలైన నిధులు మంజూరులో వెలుగు అధికారులు చేస్తున్న జాప్యంపై మండలంలోని చోలేమర్రి గ్రామంలోని మారుతీ మహిళాసంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సిసితో వాగ్వాదానికి దిగారు. ఆసరా కింద తమ సంఘానికి మంజూరైన నిధులను సిసి అందకుండా చేస్తున్నాడని విమర్శించారు. ఈ విషయంపై కారణాలు అడిగితే సంఘంపై 39 వేల రూపాయలు అప్పు ఉందని వాటిని చెల్లిస్తే సంతకాలు చేపడతామని సిసి సమాధానమిచ్చారు. అయితే తమ సంఘం ఎలాంటి అప్పుల లేదని మహిళలు చెప్పారు. గతంలో ఉన్న సీసీలు మారుతీసంఘానికి అప్పు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపారని సిసి సమాధానమిచ్చారు. దీనిపై మహిళాసంఘ సభ్యులు వివరాలు ఆరా తీయగా 2010గ్రామైక్యసంఘానికి రూ.2.60 లక్షలు అప్పు ఇచ్చినట్లు గ్రామైక్యసంఘం లీడర్ సమాధానమిచ్చారు. అయితే ఆ నిధులను మారుతీ సంఘానికి ఇవ్వలేదని నిర్ధారించారు. దీంతో సిసి వాస్తవాన్ని గ్రహించారు. అయితే సంఘంలోని ప్రతిసభ్యురాలు ఎన్ఆర్ఎల్ఎంకు సంవత్సరానికి రూ.500 ప్రకారం రెండు సంవత్సరాలకు సంబందించి వెయ్యిరూపాయలు కట్టాలని చెప్పాడు. ఆడబ్బులు చెల్లిస్తే ఆసరా నిధులు సంఘానికి మంజూరు చేయడానికి సంతకం పెడతానని చెప్పారు.



సిసిని ప్రశ్నిస్తున్న మహిళలు

సిఎం దిష్టిబొమ్మ దహనం

జనసేన నాయకులు అరెస్టు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినందుకు జనసేన నాయకులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం గణేష్ కూడలిలో జనసేన నాయకులు జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వాలంటీర్ల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి నాయకులు వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత డేటాను తీసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించి వైసిపి నాయకులు మాట్లాడడం సమంజసం కాదన్నారు. వాలంటీర్లు వ్యక్తిగత డేటాను సేకరించడం వల్ల ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ నాయకుడు పవన్ చెప్పిన మాటల్లో వాస్తవాలు ఉండటం వల్లే వైసీపీ ఉలిక్కి పడుతోందన్నారు. జగన్ దిష్టిబొమ్మను దహనం చేసిన నాయకులను సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, పుట్టపర్తి, కొత్తచెరువు, ఓడిసి, నల్లమాడ మండలాల కన్వీనర్లు తలారి పెద్దన్న, పూల శివ, బడితే ఈశ్వర్, మేకల ఈశ్వర్, నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ తిరుపతేంద్ర, గణేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.



సిఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు

పోస్ట్‌కార్డు ఉద్యమానికి విశేష స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపూర్ అసెంబ్లీ నుండి సిఎం జగన్ మోహన్ రెడ్డి పోటీ చేయాలని కోరుతూ వైసిపి నాయకుడుచ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాల్మీకి నరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్ట్ కార్డు ఉద్యమానికి విశేష స్పందన లభిస్తోంది. గురువారం హిందూపురం పట్టణ పరిధిలోని పలని నగర్ లో చేపట్టిన పోస్ట్ కార్డ్ ఉద్యమానికి మహిళల నుండి విశేష స్పందన లభించింది, గత కొన్ని సంవత్సరాలుగా తాము ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో తాము ఎంతో అభివృద్ధి చెందామని అన్నారు. అలాంటి వ్యక్తి రాబోయే ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నుండి పోటీ చేస్తే ఘన విజయం సాధిస్తారన్నారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా హిందూపురం అసెంబ్లీ నుండి టిడిపి వారే గెలుపొందుతున్నారని అయితే అభివృద్ధి ఏమాత్రం జరగలేదని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో 2019 నుండి అంచలంచలుగా అభివృద్ధి జరుగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి హిందూపురం నుండి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీ తో గెలుస్తారని ప్రజల అభిప్రాయపడుతున్నారని అంతేకాకుండా ఈ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని వాల్మీకి నరేష్ పేర్కొన్నారు.



పోస్టు కార్డులు వేస్తున్న స్థానికులు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అనిఉర్దూ అకాడెమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం కదిరి పట్టణం కోర్ట్ రోడ్డులో ఉన్న ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, ఎమ్మెల్యే సిద్దారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ గ్రంథాలయం మైనారిటీ సోదరులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ గ్రంథాలయాన్ని మరింత ఆధునీకరించిందన్నారు. గ్రంథాలయాన్ని డిజిటలైజ్ చేయడంతో పాటు, ఆధునిక పరిజ్ఞానానికి సంబంధించిన అన్ని సౌకర్యాలు అందజేయడం జరిగిందన్నారు. కదిరి ప్రాంత ప్రజలు మరింత విరివిగా ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఉర్దూ గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల రూపాయలు మంజూరైనదని త్వరలోనే ప్రజలకు అందుబాటు అయ్యే విధంగా మంచి స్థలం కేటాయించి భవన నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నదీం అహ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు



నూతన వైస్‌చైర్మన్లకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే, అధికారులు

మున్సిపల్ నూతన వైస్ చైర్మన్ల ఎంపిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు భవనంలో గురువారం ఎన్నికల అధికారి, ఆర్డీవో తిప్పేనాయక్ ఆధ్వర్యంలో నూతన వైస్ చైర్మన్ల ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెలే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కాచెర్ల లక్ష్మి హాజరయ్యారు. మున్సిపల్ మొదటి వైస్ చైర్మన్ గా 2వ వార్డు కౌన్సిలర్ వేమల జయరామిరెడ్డి, రెండవ వైస్ చైర్మన్ గా 38వ వార్డు కౌన్సిలర్ షేక్ షంషాద్ బేగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇద్దరు వైస్ చైర్మన్లకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎన్నికల అధికారి తిప్పేనాయక్ మున్సిపల్ కమిషనర్ బండిశేషన్నల చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. ఆ తరువాత వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. తమపై ఎంతో నమ్మకంతో ఈపదవులు అప్పగించిన ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వైస్ చైర్మన్లు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇఇ సత్యనారాయణ, డిఇ వన్నూరుస్వామి, ఆర్వో ఆనంద్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత

వైసిపి సమన్వయకర్త దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైసిపి సమన్వయ కర్త దీపిక అన్నారు. గురువారం 15వ వార్డు రహమత్ పురంలో రూ. 12.50లక్షలతో నూతనంగా నిర్మాణం చేస్తున్న మురుగు కాలువ, కల్వర్టు, రోడ్డు పనులను దీపిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పురపాలక సంఘంలోనే అతి పెద్ద మురుగువాడ రహమత్‌పురం అన్నారు. టిడిపి అధికారంలో ఉన్న సమయంలో వార్డు కౌన్సిలర్ వైసిపి పార్టీ కావడంతో ఇక్కడ కనీస అభివృద్ధి సైతం చేయలేదన్నారు. తాము పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా నిధులను కేటాయించి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ షాజియా, డాక్టర్ బాషా,కౌన్సిలర్లు మల్లికార్జున, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దీపిక, తదితరులు

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష '



గోరంట్లలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



ధర్మవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

ప్రజాశక్తి - గోరంట్ల

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే శంకర్ నారాయణ అన్నారు. పట్టణంలోని 2,3 సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అర్హులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ జయరాం నాయక్, మండల అగ్రి చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచి సరోజ, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్పతో పాటు ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, తహశీల్దార్ రంగనాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

పుట్టపర్తి రూరల్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ రమణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దిగవచెర్లోపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 650 మందికి ధ్రవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కామాక్షమ్మ, ఎంపీటీసీ కుల్లాయప్ప, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, వైసీపీ మండల మాజీ కన్వీనర్ గంగాద్రితో పాటు మండల ప్రత్యేక అధికారి శుభదాసు , ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల పరిధిలోని మలకవేమల , కొండగట్టుపల్లి , గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేంద్ర, ఈవోఆర్డీ ఖాదర్ బాషా, జెడ్పీటీసీ తిరుమల సేవా నాయక్, ఆయా గ్రామాల వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

కొత్తచెరువు : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని మండల స్పెషల్ ఆఫీసర్ శివ రంగ ప్రసాద్ తెలిపారు. కొత్తచెరువులోని మూడవ సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామ సభను గురువారం అధికారులు ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి ఎంపీడీవో సిద్ధారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, వ్యవసాయ అధికారి నటరాజు, సర్పంచి రాధా నాగరాజు, సరళ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని మొరసలపల్లి పంచాయతీ కేంద్రంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ వెంకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమరెడ్డి, నాయకులు నాగరాజు, జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం : జగనన్న సురక్ష కార్యక్రమాన్నిప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని 7, 26, 29, 30, 24, 25, 27, 31వ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో 4128 ధ్రువీకరణ పత్రాలను అర్హులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు నాగేంద్రమ్మ, పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పేదలందరికీ సంక్షేమ పథకాలను పూర్తి దశలో అమలు కావడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ వీధిలోని కోటా స్కూల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు తీర్థాల స్వర్ణలత, షకీలా చేతుల మీదుగా 1,993 సర్టిఫికెట్లను అర్హులైన వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్ కుమార్, టిపిఆర్ఒ సుబ్బరాయుడు, వైసిపి నాయకులు ఎస్పీ భాష, తీర్థాల రమణ, సుభాన్‌బాషా, సిఐ గంగరత్నమ్మ, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాటర్ మ్యాన్‌పై దాడి

చిలమత్తూరు : మండల పరిధిలోని వడ్డిచన్నం పల్లిలో వాటర్ మ్యాన్‌గా పని చేస్తున్న గుడిబండప్ప పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గాయపడిన వాటర్ మ్యాన్ ను చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. తలకు తీవ్రంగా గాయం అవ్వడంతో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు గుడిబండప్ప తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతి

రొళ్ల : మండల పరిధిలోని కల్లురొప్పం గ్రామంలోని రైతుకు చెందిన పాడిఆవు విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. గ్రామంలోని రైతు ఈరన్నకు చెందిన పాడిఆవు నిత్యం ఉదయం, సాయంత్రం మొత్తం 16 లీటర్ల పాలు ఇచ్చేది. ఈ నేపథ్యంలో గురువారం ఈరన్నకు చెందిన పాడిఆవు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. దీంతో తనకు రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే పాడిఆవు మృతిచెందిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.



మృతిచెందిన పాడిఆవు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - తలుపుల

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుండువారిపల్లి, పూలవాండ్లపల్లి, ఎర్రిపల్లి, మామిళ్ళవారి గ్రామాలలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, జోనల్ ఇన్‌ఛార్జి డీకే బాబు, పురుషోత్తం రెడ్డి, మాజీ జిల్లా వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తదితరులతో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండ : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమనిఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాంపురం సచివాలయ పరిధిలోని నిర్వహించిన జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జిల్లా అధికారులు

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, శాసన వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను శ్రీ సత్య సాయి జిల్లా అధికారులు కలిశారు. రాష్ట్ర మంత్రి గురువారం శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం సమీపంలో గల నాసిన్(నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇంటిగ్రేడ్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్)లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరైన సందర్భంగా ఆయనను ఎస్పీ, కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ సీటు కేటాయించాలి

ప్రజాశక్తి మడకశిర రూరల్

మడకశిర మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ వృత్తి విద్య కళాశాలలో చేరడానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఉమేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శశికుమార్ తదితరులు పాల్గొన్నారు

కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం పర్యటించారు.కొత్తపల్లి, బత్తినిపల్లిలో మృతిచెందిన టిడిపి నాయకుల కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాకీర్ అహ్మద్, బడిశం రామాంజనేయులు, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న 'పల్లె'

నల్లమాడ : పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని కుటాలపల్లిలో పర్యటించారు. ఇటీవల మృతిచెందిన వెంకటరామిరెడ్డి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలను అందజేశారు. ప్రమాదంలో గాయపడ్డ యువకుడు అనిల్‌కు రూ. 2వేలను అందజేశారు. అనారోగ్యంతో ఉంటూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ పార్టీ మండల మాజీ కన్వీనర్ సీనియర్ నాయకులు విరుపాక్షి రెడ్డిని సామకోటి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాష్ట్రంలో దోపిడీ పాలన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్రంలో దోపిడీ, అవినీతి పాలన సాగుతుందని, జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ కాచర్లకంచన్న అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాచర్ల కంచన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ పేరుతో ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన జగన్ నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపారన్నారు. ఈ నాలుగేళ్లగా ప్రజలు అష్టకష్టాలు పడ్డారని సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజలు వేయి కళ్లతో ఎదురుచుస్తూన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు అంబటిసనత్, రాళ్లపల్లిషరీఫ్, నాయకులు గంగారపురవి, మారుతీస్వామి, కరెంట్ ఆది, చట్టాలక్ష్మీనారాయణ, పూట్లురు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని గుంజేపల్లిలో టిడిపి నాయకులు పర్యటించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు తోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు కార్యదర్శి రమేష్ బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, శేఖర్ రాజు, హనీఫ్, ఆనంద్, సూర్యనారాయణ, త్రిలోక్, నరేష్, ఈశ్వర్ రెడ్డి, కృష్ణ, నాగరాజు, సుధాకర, నాయుడు, జానీ, సాంబశివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కియా పరిశ్రమ తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే

పెనుకొండ : కియా పరిశ్రమను రాష్ట్రానికి తీసుకు వచ్చిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుదేననిటీడీపీ పెనుకొండ నియోజకవర్గం నాయకులు కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కియా కార్ల పరిశ్రమ ముందు అయన విలేకరులతో మాట్లాడారు. కియా కార్ల పరిశ్రమలో ఒక మిలియన్ కార్లు (10 లక్షల కార్లు)ఉత్పత్తి కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్న కియా పరిశ్రమ ను ఈ ప్రాంతానికి తీసుకురావడానికి చంద్రబాబు బాబు నాయుడు ఎంతో కృషి చేశారన్నారు. అయితే కియా కంపెనీకి జగన్మోహన్ రెడ్డి భూములు, నీరు ఇచ్చారని వైసీపీ మంత్రులు, ఎంపీ మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యే ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలన్నారు.